విగ్రహ ఆవిష్కరణకు జిల్లా నుంచి 38 బస్సులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరణ కార్యక్రమానికి సామాజిక సమతా సంకల్ప (జన్ భాగీదరి) యాత్రకు జిల్లా నుండి 38 బస్సులు విజయవాడకు బయలుదేరి వెళ్ళయాని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం స్వరాజ్య మైదానం (పిడబ్ల్యూ డి గ్రౌండ్) ఎంబి.రోడ్డు విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రారంభోత్సవం కార్యక్రమానికి గురువారం సాయంత్రం జిల్లా నుండి 38 బస్సులలో సుమారు 1500 మంది విజయవాడకు వెళ్లారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వం దిగి వచ్చే దాకా...

పోరాటం ఆపేది లేదు..

నిరవధిక దీక్షలకు మద్దతుగా 20న రాస్తారోకోలు

యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు

ప్రజాశక్తి- కుప్పం

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె 38వ రోజుకు చేరింది. గురువారం కుప్పం ప్రాజెక్టు వద్ద జరుగుతున్న శిబిరం వద్ద అంగన్వాడీల సమ్మెను ఉద్దేశించి ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడారు. రాష్ట్ర కేంద్రంలో జరుగుతున్న అంగన్వాడీల నిరవధిక దీక్షలకు మద్దతుగా 20న గంటపాటు జరిగే రాస్తారోకోలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వడానికి కుప్పం ప్రాజెక్టులో సిడిపిఓ, సూపర్వైజర్లు ఎవరు రాకపోవడం దారుణమన్నారు. కేవలం సీనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉండి తీసుకోవడంతో గంటల తరబడి సమయం ఆలస్యం అవుతున్నదన్నారు. వందలాది మంది వద్ద ఒక్కరే తీసుకుంటూ అంగన్వాడీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. గత 38రోజులుగా ప్రాజెక్ట్ అధికారులు ఎవరూ ఆఫీసుకు రాకుండా బయటే ఉంటున్నారని, జిల్లాలో ఎక్కడా లేని విచిత్ర పరిస్థితి కుప్పంలో కొనసాగుతున్నదని అన్నారు. అయినా జిల్లా ఉన్నతాధికారులు కుప్పం వైపు కన్నెత్తి చూడరని, కుప్పంలో ఉన్న సిడిపిఓ చూసి భయపడుతున్నారా లేక వారిచ్చే కమిషన్లకు పాల్పడి రాకుండా వెళ్తున్నారా అర్థం కాని పరిస్థితి అని ఆరోపించారు. అన్ని రకాల అక్రమాలు నడుస్తున్న కుప్పం ఐసిడిఎస్ అధికారులపై జిల్లా కలెక్టర్ కూడా ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు. దీనికి తోడు ఇక్కడున్నా ప్రజాప్రతినిధులు క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు బెదిరిస్తూ మిమ్మల్ని తొలగించి కొత్తవారిని నియమించుకుంటామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమని అన్నారు. గత 38 రోజులుగా అంగన్వాడీలు బెదరని వారు ఇప్పుడు మీరు బెదిరిస్తే బెదిరిపోతారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బెదిరింపులు పక్కన పెట్టి రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్వాడీల సమస్యలను పరిష్కారాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దగ్గరలో జరిగే ఎన్నికలలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. అధ్యక్షురాలు లలిత, ప్రమీల, సరళ, భారతి, మోహన్ లక్ష్మి పాల్గొన్నారు.

శాంతిపురం: ప్రభుత్వం దిగివచ్చేదాకా అంగన్వాడీల పోరాటాన్ని ఆపేది లేదని సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు. గురువారం 38వ రోజు అంగన్వాడీల సమ్మెలో శాంతిపురం ప్రాజెక్టు శిబిరంలో అంగన్వాడీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అంగన్వాడీలు అడిగిన న్యాయపరమైన డిమాండ్లను తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఉద్యమాన్ని నీరుగారిచేందుకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. గత 38 రోజులుగా అన్ని వదులుకొని రోడ్లపై బైఠాయించిన అంగన్వాడీలను ఉద్దేశించి కొంతమంది అధికార పార్టీ నాయకులు చులకనగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

కుప్పంలో అంగన్వాడీల సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు

బెంబేలెత్తిస్తున్న గజరాజులు

- **ఏనుగుల దాడుల్లో ప్రాణ, పంటనష్టం**

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని అటవీసమీప ప్రాంతాల ప్రజలను గజరాజులు గజ గజ వణికిస్తున్నాయి. తరచూ ఏనుగులు జిల్లాలోని పలమనేరు, వికోట, బైరెడ్డిపల్లి మండలాలతో పాటు ఇటీవల గుడిపాల, బంగారుపాళ్యం మండలాలపై కూడా దాడులు చేయడం సర్వసాధారణంగా మారిపోయింది. ఏనుగులు దాడులు చేసి ప్రాణ, పంట నష్టం చోటుచేసుకున్న సందర్భల్లో హాడావిడి చేసే ఫారెస్టు అధికారులు ప్రజాప్రతినిధులు ఆ తరువాత పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. సరిగ్గా ఆరునెలల క్రితం గుడిపాల మండలం 190 రామాపురం వద్ద గుంపు నుండీ తప్పిపోయిన ఒంటరి ఏనుగు హల్చల్ చేసింది.

> జిల్లాలో 1.95 లక్షల హెక్టార్లలో అటవీ భూములున్నాయి. చిత్తూరు జిల్లాలోని పలమనేరు, యాదమరి, తవణంపల్లి, కుప్పం ప్రాంతాలు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న గ్రామాల్లో ఏనుగులు రావడం జరుగుతోంది. జిల్లాలోని అటవీ ప్రాతం నుండీ ఏనుగుల వేర్వేరుగా జిల్లాలో సంచరిస్తున్నాయి. గత మూడు సంవత్సరాల్లో 12 ఏనుగులు మరణించగా 8 మంది మత్యువాత పడ్డారు. 3,400 మంది రైతులు తమ పంటలన ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయారు.

సోమల మండలంలో బుధవారం ఏనుగుల దాడిలో చెరకు పంటను నష్టపోయిన రైతు సోమశేఖర్

వ్యవసాయం చేసుకుంటున్న వెంకటేష్, సెల్వి అనే భార్యభర్తల ప్రాణాలను బలికొంది. మరో ఇద్దర్ని తీవ్రంగా గాయపరిచింది. రెండు రోజుల పాటు ఫారెస్టు అధికారులు శ్రమించి ఆ ఒంటరి ఏనుగును అదుపులోకి తీసుకొని గుంపులో కలిపేంత వరకు గుడిపాల, బంగారుపాళ్యం మండల ప్రజలు చిన్నపాటి అలికిడి విన్నా ఏనుగు వచ్చిందేమోనని బెంబెలెత్తిపోయారు. రెండు నెలల క్రితం బంగాపాళ్యం మండలం కీరమంద మండలపరిషత్ పాఠశాలపై దాడి చేసిన ఏనుగులు నిత్యవసర వస్తువులను నాశనం చేశాయి. తరుచూ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ఏనుగులు దాడులు చేస్తున్నా అటవీశాఖ అధికారులు జనవాసాల్లోకి ఏనుగులు రాకుండా అరికట్టడంలో విఫలం అవుతున్నారు.

అడవుల విస్తీర్ణం తగ్గిపోవడంతో వర్షాభావ పరిస్థితుల్లో నీటికోసం వన్యమృగాలు అటవీ సమీపాల్లోని గ్రామాల్లోకి వస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో వన్యమృగాల తాగునీటి కోసం కందకాలు ఏర్పాటు చేయాలి. జనవాసాల్లోకి రాకుండా సోలార్ కంచను నిర్మించాలి. మన జిల్లాలోని పడమటి మండలాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రాంతాల్లోని అడవుల సమీప గ్రామాల్లో ఏనుగులు పంటపొలాలపై పడుతున్నాయి. ఏనుగుల కదలికలను గుర్తించిన వెంటనే అటవీశాఖ సిబ్బంది సమాచారం ఇవ్వాలని అటవీశాఖ సూచిస్తున్నా రాత్రి సమయాల్లో ఏనుగులు దాడులు చేయడం, పొలాల్లోని రైతులు అటవీశాఖ అధికార్లకు ఏనుగుల సంచారంపై సమాచారం ఇవ్వడం ఆలస్యం అవుతోంది.

సోలార్ ఫెన్సింగ్ ఎప్పటికి పూర్తి అయ్యేనో..

ఏనుగుల దాడి నుండీ పంటలను కాపాడేలా అటవీప్రాంత సరిహద్దుల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు అటవీశాఖ మ్యాప్ రూపొందించినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. అటవీశాఖ అధికారులు అటవీ సమీపభూముల్లో పంటసాగు మానుకొని పశుపోషణ జరపాలనే ఆదేశాలతో పాడి ఆవులను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నా పశువులను కూడా గజరాజులు వదలడం లేదు. పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. పంట పొలాలను ఏనుగుల నుండీ కాపాడెలా సోలార్ కంచె ఏర్పాటు కళగానే మిగిలిపోయిందనే చెప్పాలి.

ప్రాణ, పంట నష్టం చోటు చేసుకోకుండా చర్యలు

- చైతన్య కుమార్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి

చిత్తూరు జిల్లాలో మొత్తం అడవులు 29శాతం మేర విస్తరించి 1.95 లక్షల హెక్టర్లలో ఉన్నాయి. ఈ అడువులు శేషాచలం అడువులకు అనుసంధానంగా ఉంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. అలాగే ఏనుగుల అడవి దాటి రాకుండా కందకాలు ఏర్పాటు చేస్తున్నాం. ఏనుగుల సంచారం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. పెద్దపెద్ద శబ్దాలు చేయడం, టపాకాయలు కాల్చడం వంటివి చేయరాదు. 1.95 లక్షల హెక్టర్ల అటవీ ప్రాంతంలో 353 చదరపు కిలోమీటర్లు కౌండిన్య రాయల్ ఎలిఫెంట్ జోన్ను ఏర్పాటు చేసి ఏనుగుల సంరక్షణ జిల్లాలో సుమారు మూడు నియోజకవర్గాల్లో ప్రధానంగా నిత్యం ఏనుగులు సంచరిస్తూ పంటపొలాల కోసం రావడం రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలలో ప్రస్తుతం అనధికారిక లెక్కల ప్రకారం భారీ ఎత్తున ఏనుగులు ఉన్నట్లు అటవీ శాఖాధికారులు అంచన వేశాం. ఆహారం, నీటి కోసం పంటపొల్లోకి వస్తున్న ఏనుగుల నుండీ పంటను కాపాడుకోవడం కోసం రైతులు ఏనుగులను అడవిలోకి తరిమే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఏనుగుల దాడిలో మరణాలు చోటు చేసుకుంటున్నాయి. ఏనుగులు అటవీ ప్రాంతం నుంచి బయటకు రాకుండా కాంటూరు కందకాలు తవ్వడం, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ వేయడం జరుగు తున్నది. ఇప్పటివరకు 70 కిలోమీటర్లకు పైగా సోలార్ ఫెన్సింగ్ వేయగా మరో 60 కిలోమీటర్లు తవ్వడం జరిగింది. ప్రజలను భయాందోళన నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ట్రాకర్లను ఉపయోగించి పంట పొలాల వైపు వచ్చిన ఏనుగులను తిరిగి అటవీ ప్రాంతాల్లోకి ట్రాప్ చేయడం నిరంతరంగా జరిగే ప్రక్రియ. పట్టుపురుగుల పంటపై ఏనుగులు దాడిచేసే అవకాశం చాల తక్కువగా ఉంటుంది. ఈమేరకు పట్టు పరిశ్రమ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మల్బరీ పంటను సాగు చేయాలని ఏనుగులు దాడులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని రైతులను ప్రొత్సహించడం జరుగుతోంది.

అక్కచెల్లెమ్మలకు సొంత ఇంటి కల సాకారం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 'పేదలందరికీ ఇళ్లు' ద్వారా పేద అక్కచెల్లెమ్మల సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశ్యంతో మహిళా సంఘాలలో ఉన్న మహిళలకు పావలా వడ్డీకే రూ.35వేల చొప్పున బ్యాంకు రుణం అందివ్వడమే కాక వాటికి సంబంధించిన వడ్డీ రీయింబర్స్మెంట్ నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్రెడ్డి వర్చువల్ ద్వారా బటన్ నొక్కి ప్రారంభించారు. ఈసందర్భంగా గురువారం ఉదయం చిత్తూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు పార్లమెంట్ సభ్యుడు ఎన్.రెడ్డెప్ప, నగరపాలక సంస్థ మేయర్ ఆముదా, గృహనిర్మాణ సంస్థ పిడి పద్మనాభం పాల్గొన్నారు. చిత్తూరు జిల్లాలో నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్మెంట్ ద్వారా 25,736మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు రూ.3,39 కోట్లు నగదు జమకు సంబంధించి మెగా చెక్ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ ఈఈలు, డీఈలు, స్త్రీ శిశు సంక్షేమ జడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్పర్సన్ భారతి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పక్కాగా 'కుల గణన'



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర పాలక సంస్థ పరిధిలో కుల గణన సర్వేను క్షేత్రస్థాయిలో పక్కాగా చేపట్టాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ సూపర్వైజర్ అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. కులగణన సర్వేపై గురువారం నగరపాలక కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కులగణన సర్వేలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోనూ శుక్రవారం ఉదయం నుంచి ప్రతి వాలంటీర్ క్లస్టర్లో సర్వే కచ్చితంగా ప్రారంభం కావాలన్నారు. సర్వే కోసం ఇప్పటికే క్షేత్రస్థాయిలో క్లస్టర్ వారీగా వాలంటీర్లను, వార్డు కార్యదర్శులను అనుసందానం చేయడం జరిగిందన్నారు. వాలంటీర్ యాప్లో నిర్దేశించిన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. సర్వే సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. కలగణన సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని, సూపర్వైజర్ అధికారులు ఎప్పటికప్పుడు సర్వే జరుగుతున్న తీరుపై పర్యవేక్షించాలన్నారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏసిపీ రామకష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు. జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్.రెడ్డెప్ప, చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ ఆముదా, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి పద్మజ, జి. గోపికృష్ణలతో కలసి గురువారం ఉదయం జిల్లా కలెక్టరేట్లో ఆన్లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్ పోర్టల్ను ఆవిష్కరించారు.



నేటి నుంచి కులగణన సర్వే ప్రారంభం

ఎలాంటి పొరపాటు జరగకుండా పూర్తి చేయాలి: కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు 'కుల గణన' సర్వే జరుగుతుందని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టర్ బంగ్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్డీఓలు తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఈఓపిఆర్డీలు, మున్సిపల్ కమిషనర్ల సచివాలయ సిబ్బందితో కుల గణన సర్వే నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కులగణన సర్వే10 రోజుల పాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మండలాన్ని నాలుగు విభాగాలుగా విభజించుకొని తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఈవోపీఆర్డీలు, మున్సిపల్ కమిషనర్లు కులగణన సర్వేపై పరిశీలించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 7గంటల కల్లా సర్వేని ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు 200 కుటుంబాలను సర్వే చేయాలని ఈరోజు చేయవలసిన కుటుంబాలను ఆరోజే పూర్తి చేయాలని, సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలన్నారు. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే, వారిని ఎట్టిపరిస్థితుల్లో చెప్పాలని బలవంతం చేయవద్దని తెలిపారు. సచివాలయ పరిధిలోని వాలంటీర్లు ఏఏ కుటుంబాలకు వెళ్లాలన్న ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, పంచాయతీ సెక్రెటరీ ఆదేశించారు. వాలంటీర్లకు సచివాలయ సిబ్బందికి మ్యాపింగ్ చేయాలని ఎంపీడీవోలు ఆదేశించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి వాలంటరీ సర్వే చేసిన తర్వాత వెరిఫికేషన్ చేయాలన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల కల్లా జిల్లాలో జరుగుతున్న కుల గణన సర్వేకి సంబంధించి ఏమైనా సమస్యలుంటే వాటికి సంబంధించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సంబంధిత ఆర్డిఓ ఆదేశించారు. ప్రతీ కుటుంబానికి సర్వే పూర్తి చేసిన తర్వాత సచివాలయం సిబ్బంది, వాలంటీర్ బయోమెట్రిక్ వేసి వివరాలను అందచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి, బీసీ సంక్షేమశాఖ డిడి రబ్బానీ బాషా, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి, డిఎల్డివో రవికుమార్, డ్వామా ఏపిడి ఉమాదేవి పాల్గొన్నారు.

'రోడ్డు విస్తరణ'లో సమన్యాయం జరిగేనా..

- **అధికారపార్టీ పెద్దలకు ఒకలా.. సామాన్యులకు మరోలా..**
- **నామమాత్రంగా మున్సిపల్ అధికారుల చర్యలు**
- **కష్టంగా మారిన చిరువ్యాపారుల జీవనం**

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు పట్టణంలో ఉన్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు కేంద్ర నిధుల నుండి రూ.40 కోట్లతో పనులను చేపట్టారు. డబుల్ రోడ్డు విస్తరణలో భాగంగా మున్సిపల్ అధికారులు మార్కింగ్ వేశారు. భవన యజమానులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా కూలీల సహాయంతో మార్కింగ్ వరకు కూల్చివేత పనులు పట్టణంలో కొన్నిచోట్ల ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా షాపులు ముందు కాలువలు ఆక్రమణలు అక్కడక్కడ డ్రైనేజీ పై సిమెంటు పలకలను తొలగిస్తున్నారు. రూ.40 కోట్లతో భీమగానిపల్లి సమీపంలోని శ్రీకృష్ణదేవ రాయల్ సర్కిల్ నుండి పట్టణంలోని జాతీయ రహదారి అయిన ఎంబిటి రోడ్డు కొండ సముద్రం సమీపానగల బైపాస్ రోడ్డు సర్కిల్ వరకు విస్తరణ పనులను చేపట్టారు. రోడ్డు విస్తరణతో పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఖాళీ చేయడంతో వారి జీవనం కష్టంగా మారింది. అంతేకాకుండా వ్యాపారాలు కూడా భారీగా తగ్గాయని వారు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు వేసిన మార్కింగ్ ప్రకారం కొందరు స్వచ్ఛందంగా తొలగించడం జరుగుతుంది. వీటితోపాటు పట్టణంలో వైసిపికి చెందిన నాయకులు కూడా భవనాలు ఉన్నాయి. వాటిలో మాత్రం ఒక్క అడుగు కూడా మున్సిపల్ అధికారులు తీసివేయకపోవడంతో వారిపై విమర్శలు తీవ్రంగా వస్తున్నాయి.

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ముఖ్యనేతలు కొందరు ఈ విషయం తెలిపారు. పట్టణ అభివృద్ధికి అందరూ సహకరిస్తే బాగుంటుందని, ఎన్నికల సమయంలో దీనిపై స్పందించడానికి సుముకుత చూపలేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. దీనిపై మంత్రి కచ్చితమైన నిర్ణయాలు మున్సిపల్ అధికారులకు చెబితే వారు ఆచరించడానికి సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. డీకేటీ భూములలో ఉన్న రూములను కొన్ని ప్రాంతాలలో పూర్తిగా కూల్చివేయడం జరిగింది. అదే సమయంలో మరికొన్ని చోట్ల వైసిపి పెద్దలవి కావడంతో మున్సిపల్ అధికారులు వాటిని టచ్ కూడా చేయలేకపోతున్నారు. సహజంగా 60 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరించాల్సి ఉంది. అయితే బాలాజీ సినిమా థియేటర్ నుండి తూర్పు మగసాల మలుపు వరకు 60 నుండి 52 అడుగుల వరకు రోడ్డు విస్తరణ పనులు చేసి ఉన్నారు. తూర్పు మగసాల నుండి ఇందిరా సర్కిల్ వరకు 55 అడుగుల నుండి 48 అడుగుల అడుగుల వరకు రోడ్డు వెడల్పు చేశారు. ఇందిరా సర్కుల్ నుండి ప్రైవేటు బస్టాండ్, గోకుల్ సర్కిల్, నాగిరెడ్డి పెట్రోల్ బంక్, అంబేద్కర్ సర్కిల్ వరకు 48 నుండి 47 అడుగుల వరకు విస్తరణ చేశారు. వీటిలో కూడా మధ్యమధ్యలో వైసిపి నాయకులు ఉండడంతో వారు మార్కింగ్ ప్రకారం తొలగించకపోవడంతో పట్టణంలో పలువురు బహటంగా విమర్శలు చేస్తున్నారు.

మున్సిపల్ అధికారులు కూడా ఈ విషయమై వైసీపీ పెద్దలకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వలేక వారి దగ్గరికి వెళ్లి చెప్పలేక కొంతమేర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో రోడ్డు విస్తరణ పనులు చెప్పడంతో అధికార పార్టీ పై దీని ప్రభావం కొంతమేరకు ఉండవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు. రోడ్డు విస్తరణ చేపట్టడం మంచిదేనని అయితే గతంలో ఉన్న కాలువలు మాత్రం తొలగించి కొత్తగా కాలవలు వేయడం జరగడం తప్పితే ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఏ మేరకు విస్తరణ చేపట్టవలసి ఉంటే అంత విస్తరణ చేపట్టి ఉంటే బాగుంటుందని మరికొందరు అంటున్నారు. జాతీయ రహదారి నిబంధనల ప్రకారం 60 అడుగుల రోడ్డు ఇరువైపుల పది అడుగులు కాలువలు నిర్మించాల్సి ఉంది. ఆ నిబంధనలైతే ఎక్కడ అమలు కావడం లేదనిపిస్తుంది. రోడ్డు విస్తరణకు సుమారు 70 అడుగులు అవసరం ఉంటుంది అయితే కొన్ని ప్రాంతాల్లో 60 అడుగుల వరకు మరికొన్ని ప్రాంతాల్లో 48 అడుగులు మాత్రమే కాలువతో కలిసి రోడ్డుపనులు పుంగనూరు పట్టణంలో జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది.

నవోదయ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి :డిఆర్ఓ

పరీక్ష ఏర్పాట్లను సమీక్షిస్తున్న డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మదనపల్లి సమీపంలోని వలసపల్లి నవోదయ పాఠశాలలో ప్రవేశానికి అర్హత పరీక్షలు ఈనెల 20న జిల్లాలోని 14 కేంద్రాలలో నిర్వహించబడతాయని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. రాజశేఖర్ తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్లో నవోదయ పరీక్షలకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో 14 కేంద్రాలలో 2347మంది విద్యార్థులు నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హత కోసం పరీక్షలు రాయడం జరుగుతుందన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలన్నారు. పోలీస్శాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించి, పరీక్షల సమయంలో జిరాక్స్ కేంద్రాలు తెరవకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచుకోవాలన్నారు. అలాగే విద్యుత్ శాఖ వారు పరీక్షా కేంద్రాలు ప్రాంతాలలో నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వాలని, ఆర్టీసీ వారు పరీక్షలు నిర్వహించబడే ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు సకాలంలో చేరేలా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు సంబంధించి తనిఖీ అధికారులుగా తహశీల్దారులు, మండల విద్యాశాఖ అధికారులను నియమించడం జరిగిందని పరీక్ష నిర్వహణ సమయంలో సెంటర్లను పరిశీలించాలని, పరీక్షల ప్రశాంత నిర్వహణకు అందరూ కలిసి పని చేయాలనన్నారు. మదనపల్లి జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ గోవిందరావు మాట్లాడుతూ 2024 సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశానికి సంబంధించి అర్హత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నవోదయ పాఠశాల ఉండడం వల్ల చిత్తూరు జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 2347 మంది విద్యార్థులకు 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబడవని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు, ఆర్టీసీ నుంచి డిఎం రూపశ్రీ, వైద్య ఆరోగ్యశాఖ నుంచి డాక్టర్ శిరీష, పోలీస్శాఖ నుంచి నాగరాజు, కలెక్టరేట్ నుంచి వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ ఆఫ్ ఇండియా క్రీడాకారునికి మంత్రి అభినందన

ప్రజాశక్తి- నగరి : మహారాష్ట్ర గచ్చిరోలిలో జరిగిన 69వ సీనియర్ నేషనల్ బాల్ బాడ్మింటన్ పోటీలలో మన రాష్ట్రం ద్వితీయ స్థానం సాధించగా పుత్తూరు రూరల్ మండల కేబీఆర్ పురంకు చెందిన రూపేంద్ర ఉత్తమ ప్రతిభ కనబరచి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డు పొందాడు. గురువారం మంత్రి నివాసానికి విచ్చేసిన రూపేంద్రను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అభినందించారు. జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడం, స్టార్ ఆఫ్ ఇండియా పురస్కారం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించడానికి పలు పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. పాఠశాలస్థాయి నుంచే క్రీడాకారులను రూపొందించడానికి తల్లితండ్రులు ప్రోత్సాహించాలన్నారు. నియోజకవర్గంలో ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడంలో ఆసక్తి కనబరుస్తున్న ఫిజికల్ డైరెక్టర్ గోపిని అభినందించారు. క్రీడాకారులు రూపేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, మంత్రి అందించిన సహకారంతోనే స్టార్ ఆఫ్ ఇండియా సాధించారన్నారు.



ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి


చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని పురస్కరిచుకొని పార్టీ కార్యాలయంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి జిజేఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్మోహన్, మాజీ ఎంఎల్ దొరబాబు, నగర అధ్యక్షురాలు కఠారి హేమలత, పార్లమెంట్ కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీలతో పాటు పలువురు నేతలు నివాళ్ళు అర్పించారు. అలాగే డిసిసిబి బ్యాంకు, కార్పొరేషన్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయాల వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు నివాళ్ళు అర్పించారు. పిసీఆర్ కాలేజ్ వద్ద 1500 మందికి అన్నదానం చేశారు.

గంగాధర నెల్లూరు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు అని టిడిపి నాయకులు నియాజ్ అలి, నీరజాక్షులురెడ్డి, జీవరత్నం అన్నారు. మండలంలోని తూగుండ్రం గ్రామంలో ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళు లర్పించారు. ఈసందర్భంగా 300 మందికి అన్నదానం చేశారు. నరసింహులు నాయుడు, శాంతకుమార్, జ్యోతి యాదవ్, సంపత్, శ్రీనివాసులు శెట్టి పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి వేడుకలను టిడిపి, జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఆర్‌బిసి.కుట్టి, నాగరాజు రెడ్డి, సుబ్రహ్మణ్యం గౌడ అన్న క్యాంటీన్ వద్ద అన్నదానం చేశారు. జనసేన నాయకులు దిలీప్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ఎన్టీఆర్ 23వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కిషన్‌చంద్, మోహన్ యాదవ్, గాలి బాబునాయుడు, వెంకట రమణారెడ్డి, గురవయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

బంగారుపాళ్యంలో..

కుప్పం: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త పిఎస్ మునిరత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్న క్యాంటీన్ ద్వారా 700మందికి అన్నదానం చేశారు.


కుప్పంలో..

కార్వేటినగరం: పేదల మనలను పొందిన ఏకైక వ్యక్తి ఎన్టీ రామారావు అన్ని మండల పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రరెడ్డి అన్నారు. గురువారం కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 500 మందికి అన్నదానం చేశారు. తిరుమలనాథ్, రవి యాదవ్ పాల్గొన్నారు.

రామకుప్పం: గురువారం టిడిపి పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, నాయకులు ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సీతాపతి, శ్రీనివాసులు రెడ్డి, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: సంక్షేమ సారధి నందమూరి తారక రామారావు అని మండల తెలుగుదేశం అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎన్టీఆర్ 28వ వర్ధంతి కార్యక్రమం ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు, ఉప సర్పంచ్ లోకనాథ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సోమల: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని మండలంలోని పెద్ద ఉప్పరపల్లె ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచి యదుశేకర నాయుడు, ఉమాపతి నాయుడు, వినోద్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మండల పార్టీ అధ్యక్షుడు బిఎం.కిషోర్, నాయకులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

వికోట: నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

రామకుప్పంలో..

పలమనేరులో..

క్రైం న్యూస్

హత్యకేసులో ముద్దాయికి 11 ఏళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

హత్య కేసులో ముద్దాయి వీరేష్‌కు 11 ఏండ్లు జైలు శిక్ష విధిస్తూ ఒకటో అడిషనల్ జిల్లా జడ్జి గురువారం తీర్పునిచ్చారు. వివరాల మేరకు.. చిత్తూరు పట్టణంలో గల జేఎంసి కన్స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్ నందు కూలీలుగా పనిచేస్తున్న వేముల రాములు, వీరేశ్ అను 'మే' డే రోజున రాత్రి సమయం సుమారు 9 గంటల ప్రాంతంలో వరిగిపల్లె వద్ద మద్యం తాగిన తరువాత భోజనం చేసే విషయంలో చిన్నపాటి గొడవ మొదలయ్యి ముద్దాయి వీరేశ్ వేముల రాములు తలపై కర్రతో గట్టిగా కొట్టడంతో అతనికి రక్తస్రావం అయ్యింది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళే దారిలోనే వేముల రాములు చనిపోవడం జరిగింది. ఈ హత్య కేసుకు సంబంధించి చనిపోయిన వేముల రాములు భార్య శయమ్మ చిత్తూరు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి రెండవ పట్టణ ఇన్స్పెక్టర్ మద్దయ్యాచారిని విచారణ అధికారిగా నియమించగా ఈ ఏడాది మే 2వ తేదీన ముద్దాయి పని చేసే పరిసరాల ప్రాంతంలో అరెస్ట్ చేసి దర్యాప్తు నిమిత్తం రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణ పూర్తి అయి గురువారం తీర్పు ఇవ్వడం జరిగింది. సదరు తీర్పులో భాగంగా ముద్దాయి వీరేశ్‌కు 1వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జ్ ముద్దాయికి 11 సంవత్సరాల జైలు శిక్ష విదిస్తూ తీర్పును ఇచ్చారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక విద్యానగర్ సమీపంలో అగ్రికల్చర్ కళాశాల వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి వయసు (55) సంవత్సరాలు ఉంటుందని సిమెంట్ కలర్ ఫ్యాంటు, బిస్కెల్ కలర్ షర్టు ధరించి ఉన్నట్లు చిత్తూరు రైల్వే స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు 94942 28854 నెంబర్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గుర్తు తెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు సిఐ నాగరాజురావు తెలిపారు. సిఐ మాట్లాడుతూ 15వ తేదీ రాత్రి తంబగానిపల్లి జాతీయ రహదారి పక్క అపారస్మృతిలో యువకుడు పడి ఉండడం గమనించి 108 సిబ్బంది చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 16వ తారీకు మృతిచెందాడు. మృతుని గుర్తించిన వారు బంగారుపాలెం సీఐ నాగరాజురావు సంప్రదించాలని 9440796736 తెలిపారు. మృతదేహం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీల ఉన్నదని ఎవరికన్నా తెలిసినవారు పై నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక ఓవర్‌బ్రిడ్జిపై గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వయసు 50 సంవత్సరాలు ఉంటుంది. బ్లూకలర్ షర్టు, జీన్సీ ఫ్యాటు ధరించి ఉన్నాడు. ఓవర్ బిడ్జిపై నడుచుకుంటున్న వెళుతున్న సమయంలో వాహనం ఢీకొని తీవ్రగాయాలతో మృతి చెందివుండవచ్చని వన్‌టౌన్ పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి వివరాలు తెలియాల్సి ఉందని వన్‌టౌన్ సిఐ విశ్వనాధరెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని కేంచన బల్ల గ్రామంలో కర్ణాటక మద్యం నిల్వ ఉంచడంతో ఎస్ఐ శివకుమార్ తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. గురువారం గ్రామంలోని కర్ణాటక మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించి 50వేల రూపాయలు విలువచేసే మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సురేష్ బాబు అనే వ్యక్తిని అదుపులోకి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించమన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో అక్రమ మద్యం, రవాణా చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైక్ దొంగలు అరెస్టు

ఆరు ద్విచక్రవాహనాలు, నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: వాహనాల తనిఖీల్లో భాగంగా పలువురు ద్విచక్రవాహనాల దొంగలను అరెస్టు చేసి వారి నుంచి నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు గంగవరం సిఐ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం మండలంలోని వెంగంవారిపల్లి క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. పోలీసులను చూసి ముగ్గరు వ్యక్తులు పరారవ్వడానికి ప్రయత్నించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.వారి నుంచి పది లీటర్ల నాటు సారా, వాహన రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేపట్టగా వారు వికోట, బైరెడ్డిపల్లి మండలాల్లో గతంలో 6 ద్విచక్రవాహనాలను చోరీ చేసి వెంగంవారిపల్లి అటవీ ప్రాంతంలో ముళ్ళపొదల్లో దాచి ఉంచామని తెలపారు. వెంటనే పోలీసులు ఆస్థలంకు వెళ్లి 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు విగ్నేష్, రాజు, దినేష్ స్టాలిన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సదరు నిందితులు తమిళనాడు రాష్ట్రంకు చెందినవారని తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వారిని కూడా తర్వలో పట్టుకుంటామని తెలిపారు.

కాలేజీ బస్సు బోల్తా

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని మోతరంగనపల్లె బస్టాప్‌కు సమీపంలో చిత్తూరుకు చెందిన వివేకానంద జూనియర్ కాలేజీ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. చిత్తూరుకు చెందిన వివేకానంద జూనియర్ కాలేజ్ బస్సు ఎస్ఆర్ పురం, గంగాధర నెల్లూరు మండలంలో విద్యార్థులను ఎక్కించుకుని చిత్తూరుకు వస్తుండగా గంగాధర నెల్లూరు మండలంలోని మోతరంగనపల్లి గుడికి సమీపంలో రోడ్డు పక్కన బోల్తా పడింది. ఆ బస్సులో సుమారు 28 మంది విద్యార్థుల ఉండగా వారిలో నలుగురు గాయపడటంతో వారిని 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ రామాంజనేయులు ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సదరు బస్సు డ్రైవర్ స్టీరింగ్ తిరుగుపోవడం వల్ల ప్రమాదం జరిగిందని, భయపడి కాలు, చేతి బ్రేక్లు రెండు ఒకేసారి వేయటం వల్ల బస్సు బోల్తా పడిందని వివరించినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి జనంలోకి జనసేన

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకురాలు చైతన్య

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: శుక్రవారం నుండి చిత్తూరు నియోజకవర్గంలో జనసేన ప్రజల్లోకి కార్యక్రమాలను విస్తృతంగా తీసుకుపోనున్నట్లు జనసేన నాయకురాలు చైతన్య తెలిపారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చైతన్య మాట్లాడుతూ ప్రజల్లోకి విస్తృతంగా జనసేన కార్యక్రమాలను తీసుకుపోనున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తాను ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. టిడిపి జనసేన పొత్తుల్లో భాగంగా ఏ స్థానం నుంచి పోటీ చేయబోయే విషయం ఈనెల 26వ తేదీ తెలియనున్నట్లు చెప్పారు. తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తాను పోటీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దయారాం పాల్గొన్నారు.

పవిత్ర మురళీకృష్ణను సన్మానించిన సురేష్

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన పవిత్ర మురళీకృష్ణను మండల విశ్వబ్రాహ్మణ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో గురువారం పలమనేరులోని వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పవిత్ర మురళి కృష్ణ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తామని అందుకు విశ్వబ్రాహ్మణుల ఐక్యత చాలా ముఖ్యమని అన్నారు. సురేష్ మాట్లాడుతూ పలమనేరు పట్టణానికి సంబంధించిన పవిత్ర మురళీకృష్ణను రాష్ట్రస్థాయి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌కు అభినందనలు తెలియజేస్తూ పవిత్ర మురళీకృష్ణను నియమించడం పట్ల ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కౌన్సిలర్ కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- నగరి: మున్సిపల్ పరిధి 6వ వార్డు నగరి కాలనీకి చెందిన కౌన్సిలర్ సాయి సంధ్యారాణి తండ్రి అన్బు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం వారి స్వగృహానికి వెళ్లిన మంత్రి ఆర్కేరోజా ఆమె భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమని అన్బు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్బు పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగానే పార్టీ ఆయన కుటుంబ సభ్యులకు కౌన్సిలర్‌గా అవకాశం కల్పించిందన్నారు.

మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: జిల్లాలో ప్రధానంగా ఉద్యానవన పంటలు సాగు అవుతున్నాయని, అందులో మామిడి పంట ఎక్కువగా ఉన్నదని నాణ్యమైన దిగుబడుల కోసం తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందే విధంగా అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు తీసుకొని క్షేత్రస్థాయిలో పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం వెదురుకుప్పం మండల కేంద్రంలో మామిడికి పూత దశ నుంచి కోత దశ వరకు చేపట్టాల్సిన చర్యల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ప్రస్తుతం ఉద్యానవనశాఖ సిబ్బంది ఉన్నారని భూసారానికి సంబంధించి

వ్యవసాయ అధికారులు ఉద్యాన పంటలలో చేపట్టాల్సిన చర్యల గురించి ఉద్యాన శాఖ సిబ్బంది సలహాలు సూచనలను పాటిస్తే మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని అన్నారు. పూతదశ నుంచి కోతదశ వరకు యాజమాన్య పద్ధతులను పాటించి తక్కువఖర్చుతో నాణ్యమైన దిగుబడులు పొందే విధంగా చూసుకోవాలని అన్నారు. మామిడి తోటల విషయంలో ఎటువంటి అనుమానాలు వచ్చిన సమీపంలోని రైతు భరోసా కేంద్రాలలో ఉన్న ఉద్యానవన సిబ్బందిని సంప్రదించవచ్చునని ఆయన అన్నారు. ఎక్కువగా ఏదైనా వ్యాధులు వచ్చినట్లయితే ఆ ఉద్యాన శాఖ సిబ్బందిపై అధికారులకు తెలపడంతో పాటు శాస్త్రవేత్తలను రప్పించి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలు గురించి పంటల నాణ్యత కోసం చేపట్టే చర్యలు గురించి వారి ద్వారా తెలుసుకొని వారి సూచనలను అనుసరించినట్లయితే మంచి ఆదాయం పొందేందుకు వీలు ఉంటుందన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ఏడిఏ శివశంకర్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని ఏడిఏ శివశంకర్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందులు విక్రయించే దుకాణాలను తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల ధరలను దుకాణాల ముందర సూచిక బోర్డులో

ధర నమోదు చేయాలని, అధిక ధర వికరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు విక్రయించే పురుగు మందులలో నాణ్యత చూసుకోవాలని, విక్రయించిన ఎరువులను రికార్డులు నమోదు చేయాలన్నారు. అలాగే ప్రతి ఎరువు బస్తా, పురుగు మందులు కొన్నప్పుడు తప్పకుండా రసీదు ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను

ప్రోత్సహించేందుకే 'ఆడుదాం.. ఆంధ్ర'

ప్రజాశక్తి- కార్వేటినగరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆడుదాం..ఆంధ్ర క్రీడలను ప్రారంభించారని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం మండల పరిధిలో ఎంపీడీవో మోహన మురళీ ఆధ్వర్యంలో కాగడ వెలిగించి బెలూన్లు ఎగురవేసి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సాహిస్తూ, క్రీడలకు పెద్ద పీట వేస్తుందన్నారు. ఎంపీడీవో మోహన్ మురళీ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచినవారికి నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో భాగంగా క్రికెట్ క్రీడాకారులతో పరిచయ కార్యక్రమం అనంతరం క్రికెట్ ఆడి ప్రారంభించారు. పీడీ మురళీకృష్ణరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి క్రికెట్ జట్టు ఎంపిక

బైరెడ్డిపల్లి: మండలంలోని నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర పోటీల్లో 21 సచివాలయాలకు సంబంధించి క్రికెట్ జట్లు మండల స్థాయిలో హోరాహోరీగా తలపడ్డాయి. ఎం. కొత్తూరు జట్టు జిల్లా స్థాయికి ఎంపికైంది. దీంతో ఆ పంచాయతీ సర్పంచ్ చంద్రమౌళి(రాజారెడ్డి) క్రీడాకారులను అభినందించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ఆట తీరును ప్రదర్శించి గెలుపొందాలని ఆకాంక్షించారు.

సంక్షిప్త వార్తలు

చిన్నారులను అలరించిన 'చిన్న కొండ చుట్టు'

ప్రజాశక్తి- నగరి: పట్టణంలోని భేరివీధిలో గురువారం నిర్వహించిన చిన్నకొండచుట్టు ఉత్సవాలు చిన్నారులను అలరించాయి. కొండచుట్టు ఉత్సవాలకు మరుసటి రోజున పట్టణంలోని భేరివీధిలో వలస వ్యాపారులు దుకాణాలు పెట్టడం పరిపాటి. దీంతో వీధిలో తిరనాళ్ల సందడి కనిపిస్తుంది. స్థానికులు దీన్ని చిన్న కొండచుట్టు ఉత్సవాలుగా పిలుచుకుంటారు. చిన్నారుల ఆటబొమ్మలు, మహిళలకు సంబందించిన అలంకరణ వస్తువులు, చెరుకుగడలు, తినుబండారాలు ఇక్కడ అధికంగా విక్రయిస్తారు. వాటిని కొనుగోలు చేసుకోవడానికి, వివిధ రకాలైన రంగుల రాట్నాల్లో తిరగడానికి పిల్లలు ఉత్సాహం చూపారు. దీంతో వీది మొత్తం జనంతో నిండిపోయింది.

ఈవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ట్రాన్స్‌జెండర్స్‌కు ఓటు హక్కును వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. ఈసంద్భంగా ఈవియం యాత్రాల్లో ఎలా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలో నగర కమిషనర్ అరుణ, టౌన్ ప్లానింగ్ అధికారులు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొనేలా ఈవిఎంలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా ఓటు హక్కును వినియోగంచుకొనేలా అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

విజయవాడ బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

విజయవాడలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మండలంలోని వైసిపి నాయకులు గురువారం బయలుదేరారు. ఈ బస్సును పూతలపట్టు నియోజకవర్గ ఇన్చార్జ్ సునీల్ కుమార్ జండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ శృతి వనాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరణ కార్యక్రమం చేపడుతున్నారని ఈ కార్యక్రమానికి రాష్ట్ర మొత్తంలో నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఉద్దేశంతో ప్రతి మండలం నుండి ఒక బస్సును పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, ఎంపీటీసీ హేమచంద్ర, సర్పంచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

సదుం : విజయవాడలో జరుగనున్న సామాజిక సమతా సంకల్ప యాత్ర, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణకు ఎంపిపి యల్లప్ప అధ్యక్షతన ఎంపిడిఓ కార్యాలయం నుండీ విజయవాడకు బస్సులో గురువారం పెద్దసంఖ్యలో దళిత బహుజన నాయుకులు బయలుదేరారు. ఎంపిడిఓ వరప్రసాద్, సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి డిఎం షరీఫ్ బాషా, మాజీ ఎంపిపి వెంకటస్వామి, సీతాపతి, శ్రీనివాసులు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- పెద్దపంజాణి

కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర భారతదేశంలో ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు అన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేసేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమని సర్పంచ్ అఖిల జాఫర్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వీడియో రూపంలో ప్రదర్శించారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా రైతులకు, గిరిజనులు,ఆదివాసీల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు,చర్యలను వివరించేందుకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి గోపాల్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ టిన్‌ల విక్రయానికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్‌ల అమ్మకానికి రేటు కాంట్రాక్టు కింద సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన వారు డిసెంబరు - 2024 వరకు టీటీడీ వినియోగించిన ఖాళీ టిన్‌లు సేకరించవచ్చు. తిరుపతి హరేకృష్ణ రోడ్డులో గల మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు జనవరి 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు అందజేయవలెను. ఇతర వివరాలకు మార్కెటింగ్ (వేలం) కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో సంప్రదించగలరు.

నేడు వెంకటగిరికి నారా చంద్రబాబు

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరిలో శుక్రవారం 'తెలుగుదేశం పిలుస్తోంది రా... కదిలిరా..' సభ జరగనుంది. ఈ సభకు టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు రానుండడంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదో విడత నేతల నేస్తం సభ నిర్వహించిన ప్రదేశంలోనే లక్ష మందితో సభ ఏర్పాట్లకు సిద్ధం చేస్తున్నారు. హెలికాప్టర్‌లో విశ్వదయ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో దిగి, అక్కడనుంచి రోడ్డు మార్గాన రాణిపేట అడ్డరోడ్డు మీదుగా ఐఐటి ఎదురుగా ఉన్న ప్రైవేట్ స్థలంలో సభ ఏర్పాట్లను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. దాదాపు లక్ష మందికి భోజన, మంచినీటి ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. టికెట్ ఆశిస్తున్న నాయకులు కురుగొండ్ల రామకృష్ణ, బులిగిలి మస్తానీయాదవ్ పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు సైతం ఫ్లెక్సీల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల లోపు ఈ సభ పూర్తి కానుంది.